# నాకు నచ్చిన నా కథ



కోనెనాగవెంకట ఆంజనేయులు

"వైద్యో నారాయణో హరి," డాక్టర్లు రోగులపాలిటి దేవుళ్లు. కాని ఆ దేవుళ్ళలో చాలామందికి రోగుల ఆరోగ్యం కంటే తమ సంపాదనే ముఖ్యం. అలా కాకుండా నిస్వార్థంగా, ప్రతిఫలాపేక్ష లేకుండా రోగులకు వైద్యంచేసే డాక్టర్లే నిజమైన దేవుళ్లు. అటువంటి డాక్టర్లు కొందరైనా ఈ భూమిమీద ఉన్నారన్న నమ్మకంతో వ్రాయబడిన కథ యిది. నేను యిప్పటివరకూ వ్రాసిన కథల్లో నాకు బాగా నచ్చిన కథ కూడా.

ఈ కథ ఆంధ్ర సచిత్ర వారపత్రిక 5—3—82 సంచికలో ప్రచురించబడింది.

## పాలవెల్లి

ఉదయం పదకొండుగంటలయేటప్పటికి నా దృష్టి ఆఫీసు కాగితాలమీద నుండి మరలిపోతూ వుంటుంది. అదే టైములో వచ్చే పోస్ట్‌మన్‌కోసం ఎదురు చూస్తూ వుంటాను.

ఒకవైపు "మీ రచన ప్రచురణకు అంగీకరించబడిందంటూ" ఏ పత్రిక నుండి అయినా కార్డు రాకపోదన్న ఆశతో, మరోవైపు 'నా కథ ఏదీ తిరిగి రాకూడ'దని కోరుకుంటుంటాను.

ఈరోజు పదకొండు గంటలు దాటి అయిదు నిముషాలయినా పోస్ట్‌మన్ జాడ లేదు. కుర్చీలో అసహనంగా కదలసాగేను టేబుల్ మీదున్న కాగితాలను అసహనంగా కదుపుతూ;

సరిగ్గా పదకొండూ పన్నెండు నిముషాలకు అలవాటైన అడుగులచప్పుడు వేగంగా మెట్లెక్కి పైకి రాసాగింది. అది పోస్ట్‌మన్ అడుగుల చప్పుడు.

ఉత్సుకతతో కుర్చీలో ముందుకు వంగి పోస్ట్‌మన్ రాకకు ఎదురు చూడ సాగాను. మా ఆఫీస్‌లో ముందుసీటు నాదే. పోస్ట్‌మన్ తెచ్చే పోస్ట్‌ని ముందుగా నేనే అందుకుంటాను రోజూ.

రూమ్‌లో ప్రవేశించి నమస్కారం చేసి ఆరోజు పోస్ట్‌ని నా టేబుల్ మీద ఉంచి వెళ్ళిపోయాడు పోస్ట్‌మన్. ఎక్కువగానే ఉన్నాయి ఈరోజు ఉత్తరాలు: కనీసం నాకు ఒక్కటైనా ఉండకపోదన్న ఆశ.

ముందుగా నా పేరనేమైనా ఉత్తరాలు ఉన్నాయేమోనని చూశాను. ఒక యిన్లాండ్ మాత్రం ఉంది నా పేర. ఆఫీస్‌కి సంబంధించిన ఉత్తరాలు తీసి వేరే పెట్టేను. మిగతా ఉత్తరాలు లెటర్‌బాక్స్‌లో పడేశాను.

తాపీగా కుర్చీలో చేరబడి యిన్లాండ్ అందుకుని 'ఫ్రం' అడ్రస్ చూశాను "డా. పాలవెల్లి, మల్కాపురం, విశాఖపట్టణం." రబ్బర్‌స్టాంప్ వేసిఉంది.

కుతూహలంగా కవర్ ఓపెన్ చేశాను. ఏడెనిమిది లైన్ల మేటరుంది. ఏడెనిమిది లైన్లకు కార్డు సరిపోయేది కదా—కవరెందుకు వేస్ట్‌చేశాడా అనుకుంటూ చదవసాగేను.

"ప్రియమిత్రుడు మురళికి,

మేము క్షేమం, మీరు క్షేమమని తలుస్తాను. ఫోన్‌చేసేదానికి ఉత్తరం ఎందుకువ్రాశానా అని ఆశ్చర్యపోతున్నావా? 'అవసరమైన' పని ఉండి వ్రాయాల్సి వచ్చింది. నాకు అర్జంటుగా రెండువేల రూపాయలు అప్పుగా కావాలి. నీ దగ్గర ఉంటాయని నాకు తెలుసు. డైరెక్ట్‌గా అడగలేక ఉత్తరం వ్రాయాల్సివచ్చింది. అర్థంచేసుకుని ఆదుకుంటావని ఆశిస్తున్నాను, ఎదురుచూస్తుంటాను.

మిత్రుడు—పాలవెల్లి."

కవరు మడిచి జేబులో పెట్టుకున్నాను.

పాలవెల్లి నా బాల్యమిత్రుడు. మా వూళ్లో మా యింటిపక్కనే వాళ్ళ యిల్లు. మధురమైన ఆ బాల్యావస్థలో—గోలీలాట ఆడినా, గాలిపటాలు ఎగరే

సినా, జమీందారుగారి తోటలో దొంగతనంగా మామిడికాయలు కోసినా, చెర్లో ఈతలు కొట్టినా యిద్దరం కల్సే చేసేవాళ్ళం.

ఈత నేర్చుకునే రోజుల్లో ఒకసారి చెరువులో మునిగి ఊపిరాడక కొట్టుకుంటున్న నన్ను జుట్టుపట్టుకుని ఒడ్డుకు లాక్కొచ్చి రక్షించాడు కూడా వాడు.

పరీక్షలప్పుడు యిద్దరం మా యింట్లోనో, వాళ్ళింట్లోనో కలిసి చదువుకునే వాళ్ళం హరికెన్ లాంతరు వెలుగులో. మా మైత్రి చాలామంది కుర్రాళ్ళకు కన్ను కుట్టు కూడా అయింది ఆ రోజుల్లో.

మా ఊళ్ళోనే యిద్దరం పదోతరగతి వరకూ కలిసి చదువుకున్నాం. ఆ తరువాత వాళ్ళ నాన్నగారికి మరో ఊరు ట్రాన్స్ఫరై వాళ్ళ ఫామిలీ అంతా వెళ్ళిపోయారు.

కాలగర్భంలో అనేక సంవత్సరాలు కలిసిపోయాయి. పాలవెల్లితో నా జ్ఞాపకాలు దాదాపు చెరిగిపోయే స్థాయికి వచ్చేశాయి.

ఆ స్థితిలో మేము మళ్ళీ విచిత్రంగా కలుసుకున్నాం.

నేను బి కాం: పూర్తిచేసి విశాఖపట్టణంలో ఒక ప్రైవేట్ కంపెనీలో 'ఎక్కౌంటెంట్'గా చేరాను. సంపాదించేది మూడంకెల జీతమే అయినా మా మామగారు కట్నంగా యిచ్చిన అరెకరం మామిడితోటా; మెయిన్ రోడ్డులో ఉన్న రెండు షాపుల నుండి వచ్చే అద్దె, నా జీవితాన్ని సుముఖంగానే నడిపిస్తున్నాయి. అంతో యింతో వెనక వెయ్యగలిగాను కూడా.

యిది జరిగి ఆరునెలలై ఉంటుంది.

ఆ రోజు 'గాజువాక'లో స్థలమేదో అమ్మకానికుందని తెల్సి చూద్దామని వెళ్లాను. మూడువందల గజాల స్థలం మంచి సెంటర్లో ఉంది. బేరం కుదుర్చుకుని వెంటనే అడ్వాన్సు కూడా యిచ్చేశాను.

ఆ పని ముగించుకుని బస్సులో తిరిగి వస్తున్నాను. కిటికీ ప్రక్కన సింగిల్ సీట్లో కూర్చున్నాను. అనుకోకుండా ఊడిపోయిన బస్సు రేకు ఒకటి నా ఎడమచేతిలో దిగి రక్తం కారసాగింది. తరువాతి స్టాప్‌లో దిగి డాక్టర్ దగ్గరకు వెళ్ళమని సలహా యిచ్చారెవరో.

గాయానికి జేబురుమాలు చుట్టాను.

తరువాతి స్టాప్‌లో దిగిపోయాను — మల్కాపురం స్టేజి అది. ఆ ప్రాంతలో ఎవరైనా డాక్టర్ వున్నాడేమోనని వాకబు చేసుకుంటూ వెళ్ళాను.

రెండు సందుల తర్వాత ఎవరో డాక్టర్ ఉన్నాడని చెప్పారు ఒక కిళ్ళీ షాపతను: అటు వెళ్లాను అతనికి కృతజ్ఞత తెలపి.

ఒక యింటిముందు "డా. పాలవెల్లి. ఎమ్.బి.బి.యస్" అని బోర్డు కనిపించింది.

పాలవెల్లి పేరు చూడగానే నాకు మావాడే జ్ఞాపకం వచ్చాడు. సాధారణంగా ఆ పేరు ఎవరికీ ఉండదు. వినాయక చవితిరోజున పుట్టాడట వాడు—వినాయకుడని పేరు పెట్టలేక 'పాలవెల్లి' అని పెట్టారట.

కుతూహలంగా గేటు తెరుచుకుని లోపలకు వెళ్ళాను. లోపలికి వెళ్ళిన తరువాత నా ఊహ నూటికి నూరుపాళ్ళు కరెక్ట్ అని తేలింది,

నన్ను గుర్తుపట్టి ఎంతో ఆదరించాడు. పాలవెల్లి నా గాయం చూసి ఎంతో ఆదుర్దాపడ్డాడు కూడా. జరిగింది చెప్పేను వాడికి. గాయానికి మందువేసి కట్టుకట్టి సెప్టిక్ కాకుండా యింజక్షన్ కూడా చేశాడు.

తరువాత తన ఫామిలీని పరిచయం చేశాడు. వాడి భార్య విమల—సామాన్య కుటుంబంలోంచి వచ్చిన అమ్మాయి. మావాడు ప్రేమించి పెళ్ళిచేసుకున్నాడట. ముగ్గురు పిల్లలు వాడికి - యిద్దరమ్మాయిలు, ఒక అబ్బాయి. అబ్బాయి చిన్నవాడు, ముగ్గురూ ముచ్చటగా, డిసిప్లిన్డ్‌గా ఉన్నారు.

వాడు గవర్నమెంటు హాస్పిటల్‌లో అయిదేళ్ళనుంచీ ఉద్యోగం చేస్తున్నాడట. వాడు ఉంటున్నది చిన్న డాబా యిల్లు. సింపుల్‌గా ఉంది. ఆఫీస్ నుంచి లోన్ తీసుకుని కట్టుకున్నాడట ఆ యిల్లు. హాస్పిటల్‌లో ఉద్యోగంచేస్తూ తీరిక సమయంలో ప్రైవేట్‌గా ప్రాక్టీస్ కూడా చేస్తున్నాడట. నాలుగుచేతులా బాగానే సంపాదిస్తున్నాడన్నమాట. చీకూ చింతా లేని జీవితం.

ఆ పూట వాడి ఇంట్లోనే ఉండి ఆ సాయంత్రం తిరిగి విశాఖపట్టణం వచ్చేశాను. అప్పటినుండి అప్పుడప్పుడు యిద్దరం కలుసుకుంటూ ఉన్నాం. రెండుమూడుసార్లు వాడు ఫామిలీతో సహా మా యింటికి కూడా వచ్చాడు. మా ఫామిలీని తీసుకుని నేను ఒకసారి మాత్రమే వెళ్ళగలిగాను వాళ్ళింటికి. వాళ్ళు మా యింటికి వచ్చినప్పుడు-సినిమాలకు, షికార్లకూ కలిసి తిరిగే వాళ్ళం. చాలా కొద్దికాలంలోనే వాడి ఫామిలీ, నా ఫామిలీ చాలా సన్నిహితం అయిపోయారు.

వారం రోజుల క్రితం యిద్దరం 'రాజ్‌కమల్' థియేటర్‌లో కలుసుకున్నాం అనుకోకుండా. ఆ రాత్రి యిద్దరం కలిసి హోటల్లో భోజనం కూడా చేశాము. అప్పుడేమీ చెప్పలేదు వాడు డబ్బు అవసరం గురించి.

అయినా వీడికి డబ్బు అవసరం ఎందుకు వచ్చిందో నాకు అర్థం కావడంలేదు. ఉద్యోగం ద్వారా నెలకు పదిహేనువందల వరకూ సంపాదిస్తున్నాడు. యింట్లో ప్రాక్టీస్ కూడా బాగానే ఉంది. మొత్తంమీద నెలకు మూడువేలకు పైగా సంపాదిస్తున్నాడు. అటువంటి వీడికి డబ్బు అవసరం ఎందుకు వచ్చింది? నాకు వింతగా ఉంది. డాక్టర్లకు కూడా డబ్బు యిబ్బందులుంటాయా?

అప్పుడే బాంక్‌కి వెళ్ళి రెండువేల రూపాయలు డ్రా చేశాను.

మరునాడు మధ్యాహ్నం హాఫ్‌డే సి.యల్. పెట్టి ఆ డబ్బు తీసుకుని ఆఫీసునుంచి డైరెక్టుగా బస్సెక్కి మల్కాపురం బయలుదేరాను.

నేను వాళ్ళింటికి వెళ్ళేటప్పటికి సాయంత్రం నాలుగున్నర అయింది. పాలవెల్లి అప్పుడే డ్యూటీ నుంచి తిరిగి వచ్చాడు.

నన్ను డ్రాయింగ్‌రూంలో కూర్చోబెట్టి వాడు స్నానానికి వెళ్ళాడు. విమల వచ్చి కుశలప్రశ్నలు వేసింది కాసేపు. పిల్లలింకా స్కూలు నుండి రాలేదు కాబోలు. యిల్లు నిశ్శబ్దంగా ఉంది.

వాడు స్నానంచేసి వచ్చిన తరువాత యిద్దరికీ టిఫిన్ తీసుకువచ్చింది విమల.


జీడిపప్పు ఎక్కువ వేసిన ఉప్మా, ఉల్లిపాయ పెసరట్ టిఫిన్. మిగల్చకుండా తినేసి కాఫీ త్రాగాను. మధురంగా ఉంది. ఫిల్టర్ కాఫీ. వంట కూడా అద్భుతంగా చేస్తుంది విమల. రెండుమూడుసార్లు ఆమె పాకప్రావీణ్యాన్ని చవిచూసే భాగ్యం కూడా కలిగింది నాకు.

టిఫిన్ చేసిన తరువాత ఒక అరగంట పిచ్చాపాటీ మాట్లాడుకున్నాము నేనూ, పాలవెల్లి.

డబ్బు తీసుకువచ్చావా అని వాడు అడగలేదు. నేనూ ఆ విషయం ఎత్తలేదు. నా సందేహనివృత్తి కోసం చూస్తున్నాను.

వాడికి డబ్బు యిబ్బంది ఎందుకు వచ్చింది? కనీసం రెండువేల రూపాయలైనా బాంక్‌లో లేకుండా ఎందుకుంది అంత సంపాదిస్తున్న వాడికి? అదే అడుగుదామనుకుంటున్నాను. కాని వాడింకా డబ్బు విషయం ఎత్తలేదు. డైరెక్ట్‌గా అడగలేక ఉత్తరం వ్రాసినట్లు నాకు తెలుసు. కాని అడుగుతాడేమోనని చూస్తున్నాను.

"నమస్కారం డాక్టర్‌గారూ!"




తలెత్తి చూశాం యిద్దరమూ. ఎవరో యాభై ఏళ్ళ వ్యక్తి, పన్నెండేళ్ళ అమ్మాయి కనిపించారు గుమ్మంలో.

"రండి పరంధామయ్యగారూ!" అంటూ ఆహ్వానించాడు మావాడు లేచి.

వాళ్ళిద్దరూ వచ్చి సోఫాలో కూర్చున్నారు.

ఆ పాప వాడి పాత పేషెంటే కాబోలు. స్టెతస్కోపు తగిలించుకుని పాపను పరీక్షించాడు అయిదు నిముషాలసేపు. పాప వాడిన మందుల లిస్టుకూడా అడిగి తీసుకుని పరిశీలించాడు.

"గుడ్! పాప బాగానే కోలుకుంటోందండీ. మందులు అవే కంటిన్యూ చెయ్యండి. మళ్ళీ వచ్చేవారం తీసుకురండి" అన్నాడు పాలవెల్లి ఆయనతో మెడలోనుండి స్టెత్ తీసువేస్తూ.

"థాంక్స్! డాక్టర్‌గారూ! అంతా మీ చేతి చలవే. పాప కోలుకొని యిలా తిరగగలుగుతోందంటే అదీ మీ మహత్యమే" కృతజ్ఞత నిండిన గొంతుతో అన్నాడాయన. పర్సులోంచి యిరవై రూపాయల నోటు తీసి టీపాయ్ మీద ఫ్లవర్‌వాజ్ క్రింద పెట్టాడు.

"వెళ్ళొస్తాను సార్" అని లేచి సెలవు తీసుకుని పాపను వెంటబెట్టుకుని వెళ్ళిపోయాడాయన.

వాళ్ళు వెళ్ళిపోయిన తరువాత చెప్పేడు వాడు-

"ఆ పాప జ్యోతి-అయనకు లేకలేక కలిగిన బిడ్డ. అపురూపంగా పెంచుకుంటూ వస్తున్న పాప ఉన్నట్టుండి అనారోగ్యం పాలయింది. తరచు ఫిట్సు వస్తుంటాయి. కనిపించిన డాక్టర్ కల్లా చూపించారు. కాని గుణం

కనిపించలేదు. సంవత్సరం క్రితం నా దగ్గరకు తీసుకువచ్చారు. అప్పటి నుంచీ పాప పరిస్థితి మెరుగయింది. అందుకే నేనంటే గురి ఆయనకు. యిప్పుడు నేనే వాళ్ళ ఫామిలీ డాక్టర్‌ని."

ఈ మాట అంటున్నప్పుడు వాడి కంఠంలో గర్వం లాంటిదేమీ ధ్వనించలేదు.

అలాగా అన్నట్లు తలాడించేను.

తరువాత ఎవరో ఆడమనిషి రెండేళ్ళ పాపను తీసుకువచ్చింది. పరిస్థితి కనుక్కొని పాపను పరీక్ష చేసి ఏవో మందులు రాసిచ్చి వాడే విధానం చెప్పేడు. ఆమె కృతజ్ఞత తెలియజేసి పదిరూపాయల నోటు టేబుల్ మీద ఉంచి పాపను తీసుకుని వెళ్ళిపోయింది.

ఆమె అటు వెళ్ళగానే ఒకరి తరువాత ఒకరుగా యిద్దరు నడివయస్సు వ్యక్తులు లోపలకు వచ్చారు. ఒక వ్యక్తి సన్నగా బలహీనంగా ఉన్నాడు.

ముందుగా అతన్ని పరీక్షించసాగాడు పాలవెల్లి. రెండో వ్యక్తి మౌనంగా కూర్చున్నాడు అక్కడున్న కుర్చీలో, తన వంతు కోసం ఎదురు చూస్తూ.

ఆ వ్యక్తికి ఆయాసం కాబోలు-మా వాడు స్టెతస్కోపుతో టెస్ట్ చేస్తుంటే భారంగా ఊపిరి పీలుస్తున్నాడు. పాలవెల్లి అడిగే ప్రశ్నలకు నెమ్మదిగా, నూతి లోంచి మాట్లాడుతున్నట్టు జవాబులిస్తున్నాడు. పదినిముషాలు రకరకాలుగా ప్రశ్నించి మందులేవో రాసిచ్చి అతన్ని పంపేశాడు పాలవెల్లి. వెళ్ళిపోయే ముందు జేబులోంచి రెండు అయిదురూపాయల నోట్లు తీసి టేబుల్ మీద ఉంచి వెళ్ళిపోయాడు ఆ వ్యక్తి, ఆయాసపడుతూ.

అతడు వెళ్తుండగా మరొకాయన యిద్దరు చిన్నపిల్లలతో సహా లోపలకు వచ్చి ఖాళీగా వున్న సోఫాలో కూర్చున్నాడు. బాగా ధనవంతులనుకుంటాను రెండు చేతులకు కలిపి మొత్తం పన్నెండు ఉంగరాలు ధరించాడాయన.

ముందు వచ్చిన రెండో వ్యక్తిని పిలిచి ప్రశ్నలు వెయ్యడం మొదలు పెట్టాడు పాలవెల్లి. అయిదు నిముషాలు పరీక్షించి మందులు రాసిచ్చి అతనిచ్చిన పదిరూపాయలు తీసుకుని టేబుల్ మీద పెట్టుకున్నాడు పాలవెల్లి.

తరువాత యిద్దరు పిల్లల్ని తీసుకువచ్చినాయన పిల్లలిద్దరూ ఏమీ తినడంలేదనీ ఆకలికి మందులు వ్రాయమని అడిగాడు.

పాపకు ఆరేళ్ళు, బాబుకు ఎనిమిదేళ్ళ వయసుంటుంది.

ఆ పిల్లలిద్దరూ కూడా ఖరీదైన బట్టలు కట్టుకుని బొద్దుగా, ముద్దుగా వున్నారు.

నాకు నవ్వొచ్చింది-

అంత ముద్దుగా, ఆరోగ్యంగా ఉన్న పిల్లల్ని ఏదో జబ్బంటూ డాక్టర్ దగ్గరకు తీసుకువచ్చినందుకు.

పాలవెల్లి పిల్లల్నిద్దర్నీ పరీక్షించి వాళ్ళ ఆరోగ్యానికేమీ ఢోకా లేదని, మందులేవీ అవసరంలేదనీ అన్నాడు.

కాని ఆయన ఏవో మందులు రాస్తేగానీ ఊరుకోలేదు.

చివరికి పాలవెల్లి, "ఈ మందులు వాడండి" అని రెండు, మూడు టానిక్‌లు రాసిచ్చాడు.

ఆయన కృతజ్ఞతలు తెలియజేసి మూడు పదిరూపాయల నోట్లు బల్ల మీద పెట్టి వెళ్ళిపోయాడు.

తిండికి జరగని వాళ్లు కొందరైతే తిన్నదరగని వాళ్ళు మరికొందరు!

నవ్వుకున్నాను.

నా మనస్సు ఆలోచిస్తోంది. నా కళ్ళెదురుగా గంటసేపట్లో డెబ్భై, ఎనభై రూపాయలు సంపాదించాడు పాలవెల్లి, కుర్చీలోంచి కాలు క్రింద పెట్టకుండా.

రోజుకీ విధంగా ఎనభై రూపాయలు అదనంగా సంపాదిస్తుంటే నెల కెంతవుతుందో అంచనా వేయసాగింది నా అకౌంటెంట్ మెదడు.

ఇలా సంపాదిస్తున్నా వీడికి నా డబ్బు అవసరం ఎందుకొచ్చిందో అర్థం కావటంలేదు.

ఈ పేషంట్ల హడావిడిలో మేము మాట్లాడుకోవడమే లేదు. అప్పటికి టైము ఆరున్నరయింది. ఇంక పని ముగించుకుని వెళ్ళిపోదామనుకుంటుండగా నలుగురు వ్యక్తులు ఒక వ్యక్తిని నడిపించుకుంటూ లోపలికి తీసుకొచ్చారు.

"దండాలండీ డాక్టరుబాబూ" నలుగురు ముక్తకంఠంతో అన్నారు.

ఆ వ్యక్తిని నడిపించుకుంటూ తీసుకువచ్చి బల్లమీద కూర్చోబెట్టారు. ఆ వ్యక్తి ఒంటినిండా గాయాలున్నాయి రక్తం ఓడుతూ.

"ఏం జరిగింది?" అడిగాడు పాలవెల్లి వాళ్ళ నుద్దేశించి, ఆ వ్యక్తికి తగిలిన గాయాలు పరిశీలిస్తూ.

"ఈడు ఆ పక్క జంక్షన్‌లో అడుక్కునే బిచ్చగాడండి. ఇప్పుడే ఒక పావుగంట క్రితం రోడ్డు ప్రక్కన కూర్చుని అడుక్కుంటున్న ఈడిమీదకు ఎవరో కళ్ళు మూసుకుపోయిన బాబు కారెక్కించేసినాడండీ. ఎక్కించేసి అదే పోత పోయాడు బాబూ! కనీసం ఈడేమయాడోనని కూడా ఆగి హూళ్ళేదు బాబూ! అడుక్కునేవోడైనా అడు మనిషే కదండి. అదిదీ మన్లాటి పాణమే కదా? దగ్గర్లో మీరున్నారని మీకాడికే తీసుకొచ్చామండీ" తలపాగా చుట్టుకున్న వ్యక్తి చెప్పాడు. బహుశా అతనే రిక్షావాడో అయ్యుంటాడు. మిగతా వాళ్ళుకూడా యించుమించు అలాగే ఉన్నారు.

వాళ్ళతోసాటు వచ్చిన పన్నెండేళ్ళ కుర్రాడు ఆ వ్యక్తిని చూస్తూ ఏడవసాగాడు.

"ఈడు అడి కొడుకండి. ఈళ్ళిద్దరే! యింకెవరూ లేరు వీళ్ళకి. అప్పై నందులో పాకలో ఉంటున్నారు" మరోవ్యక్తి చెప్పాడు.

ఈ లోపల పాలవెల్లి ఆ వ్యక్తిని బల్లమీద పడుకోబెట్టి, ఒంటికి తగిలిన గాయాలన్నీ శుభ్రంచేసి మందువేసిన దూది అంటించాడు.

"అదృష్టవంతుడయ్యా యితను. ఎముకలేవీ విరగలేదు. గాయాలే బలంగా తగిలాయి" అన్నాడు పాలవెల్లి.

కుడి మోచేతి దగ్గర, తలకు, ఎడమపాదానికి గాయాలు బలంగా తగిలాయి. ఆ చోట్లలో మందువేసి కట్లుకూడా కట్టాడు. తరువాత ఏదో ఇంజక్షన్‌కూడా చేశాడు.

ఇదంతా పూర్తయేసరికి నలభై నిముషాలు పట్టింది.

అంతవరకూ ఆ నలుగురు వ్యక్తులూ, ఆ కుర్రాడూ, నేనూ వాడు చేస్తున్న పనుల్ని చూస్తూ— మధ్యమధ్యలో వాడికి సాయం చేశాము.

కట్లుకట్టి చేతులు శుభ్రంగా కడుక్కుని వచ్చి సోఫాలో కూర్చున్నాడు పాలవెల్లి అలసటగా.

"బాబూ! మీ ఫీజు..." ముందు మాట్లాడిన వ్యక్తి అన్నాడు.

"ఫరవాలేదు! నాకు ఫీజేమీ అక్కరలేదు. ఇతను మాత్రం కనీసం పది, పదిహేను రోజులు కదలకుంటా విశ్రాంతి తీసుకోవాలి. మందులు రాపిస్తాను అవి వాడుతూ, రోజూ ఇంజక్షన్ తీసుకుంటూ, బలమైన ఆహారం తీసుకుంటుంటే పదిహేను రోజుల్లో మళ్ళీ మామూలుగా తిరగగలుగుతాడు. ఈ రోజు జ్వరం రావచ్చు. కాని కంగారు పడవలసిన పనిలేదు" అంటూ ఏవో మందులు రాసి, ఆ కాగితం అందించాడు ఆ వ్యక్తికి పాలవెల్లి.

సందేహిస్తూ కాగితం అందుకున్నాడు ఆ వ్యక్తి.

"ఈడి కింకెవరూ లేరు బాబూ! అడుక్కునేవోడు. ఈడి దగ్గర అంత డబ్బు ఎక్కడుంటుంది బాబూ" అన్నాడు నీళ్ళు నములుతూ.

"ఓ! ఈ వ్యక్తి బిచ్చగాడని కదూ చెప్పారు. ఉండండి యిప్పుడే వస్తాన"నిచెప్పి లోపలికి వెళ్ళి తిరిగొచ్చాడు పాలవెల్లి. వాడి చేతిలో రెండు వందల రూపాయల నోట్లున్నాయి.

అవి ఆ కుర్రాడి చేతిలో పెడుతూ, "ఈ డబ్బు ఉంచు. నేను రాసిచ్చిన మందులు క్రమం తప్పకుండా వాడించు. రోజూ నేను మీ యింటికి వచ్చి యింజక్షన్ చేస్తాను. రేపు రా, మీ యిల్లు చూపిద్దువుగాని. పాలు పళ్ళూ అవీ బాగా తినిపించు మీ నాన్నతో. ఏమీ ఫరవాలేదు. త్వరగా నయమైపోతుందిలే" అన్నాడు ఆ కుర్రాడి భుజంతట్టి ధైర్యం చెబుతూ

ఆ నలుగురు వ్యక్తులు కూడా చాలా సంతోషించారు మా వాడి ఉదార హృదయానికి. ఆ వ్యక్తికూడా చేతులు జోడించి నమస్కరించాడు పాలవెల్లికి. నెమ్మదిగా ఆ వ్యక్తిని నడిపించుకుంటూ బయటికి తీసుకువెళ్ళి రిక్షా ఎక్కించి తీసుకువెళ్ళిపోయారు.

పాలవెల్లితో మాట్లాడకుండానే నా సందేహాలు, అనుమానాలు పూర్తిగా నివృత్తి అయ్యాయి.

ఆ పూట అక్కడే భోజనం చేశాను. వెళ్ళిపోయేముందు జేబులోంచి యిరవై వందరూపాయల నోట్లు తీసి వాడి చేతిలో పెడుతూ "ఉంచరా! నాకేమీ కంగారులేదులే. నీ దగ్గర ఉన్నప్పుడే ఇద్దువుగాని ఈ డబ్బు" అన్నాను.

ఆ డబ్బు ఏ అవసరానికో కూడా అడగలేదు.

కృతజ్ఞతగా నా చెయ్యి అందుకుని నెమ్మదిగా నొక్కాడు పాలవెల్లి.

ఒక విధమైన తృప్తితో, ఆనందంతో బయటికి నడిచాను.

